క్లుప్తంగా

యూత్ పార్లమెంట్‌లో అలేఖ్య ప్రతిభ



అలేఖ్యను అభినందిస్తున్న వీసీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు

బాలాజీచెరువు: ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహించిన జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీల్లో జేఎన్‌టీయూకే ఎంసీఏ విద్యార్థి జీఎస్ఎస్ అలేఖ్య ప్రతిభ చూపింది. జిల్లా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ అభినందించి రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు అర్హత సాధించాలన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ దార్శనికత నుంచి ప్రేరణ పొందిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, వికసిత్ భారత్ -2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించేందుకు మంచి వేదికన్నారు. వీసీ ప్రసాద్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, ఎంవీఎస్‌వీ కిరణ్మయి అభినందించారు.

ఇంటి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ

బోట్‌క్లబ్: నగరంలో ఇంటిపన్ను, కుళాయి పన్ను సకాలంలో కట్టకుంటే విధించే వడ్డీపై 50 శాతం రాయితీ కల్పించినట్టు నగరపాలకసంస్థ కమిషనర్ భావన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయి ఉన్న వారు మొత్తం బకాయిలను, ప్రస్తుత సంవత్సరం పన్ను ఒకేసారి చెల్లిస్తే వారికి ఉన్న వడ్డీలో 50 శాతం రాయితీ వస్తుందన్నారు. పన్ను కట్టేటప్పుడు 50 శాతం వడ్డీ తగ్గించి చెల్లించవచ్చునన్నారు. ఇప్పటికే కొంత మొత్తం చెల్లించిన వారు కూడా మిగిలిన మొత్తం చెల్లిస్తే వారికి కూడా 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్ను బకాయిలు చెల్లించాలన్నారు.

ఎఫ్‌జడ్ఎస్ ఎఫ్ఐ హైబ్రిడ్ బైక్ ఆవిష్కరణ



ఎఫ్‌జడ్ఎస్ నూతన బైక్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: యమహా షోరూంలో నూతనంగా వచ్చిన ఎఫ్‌జడ్ఎస్ఎఫ్ఐ హైబ్రిడ్ 150 సీసీ కొత్త బైక్‌ను మంగళవారం టూటౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ ఆవిష్కరించారు. నేవిగేషన్ మ్యాప్ ఫీచర్‌తో పాటు హైబ్రిడ్ టెక్నాలజీ, స్మార్ట్ మోటర్ జనరేటర్, స్టార్ట్ స్టాప్ సిస్టమ్ సదుపాయాలతో కొత్తగా రూపొందించిన బైక్‌ను షోరూమ్ ఎండీ సీహెచ్ తమ్మయ్యతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ అన్వర్ బేగ్, జీఎం సత్యనారాయణ, కె.రామ్మోహనరావు, యమహా ఖాతాదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రమాణాలు పెంచాలి



అంగన్‌వాడీల శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మి

కరప: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ప్రమాణాలు పెంపొందించి, చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ వై.లక్ష్మి అన్నారు. మండలం నడకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రెండో బ్యాచ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు జాతీయ విద్యా విధానం, ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్), కేంద్రాలలో పోషకాహారం అందించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సెక్టార్ సూపర్‌వైజర్లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణ, ఎం.సీత, ఉషారాణి, విష్ణు, వై.శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.

30న ఉగాది పురస్కారాలు

బోట్‌క్లబ్: భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఉగాది సందర్భంగా యువ ప్రతిభావంతులకు స్థానిక దంటు కళాక్షేత్రంలో ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు సంఘ ప్రతినిధి మాండలిక శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు పాల్గొంటారని ఆయన తెలిపారు. జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వాడపల్లి కిరణ్, మ్యూజిక్ డైరెక్టర్ నేమాని పార్థసారధి , వీరితో పాటు కందాళ లక్ష్మీనరసింహ అరుణ్, ఇంద్రగంటి సూర్య వరాహి నాగేశ్వరి, గ్రంధి వీరవెంకట నాగమణి, చామర్తి కార్తీలకు సన్మానం ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు.

కేర్‌లెస్ వద్దండీ..!



గత నవంబర్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ (ఫైల్)



15 రోజులుగా తెరచుకోని డే కేర్ సెంటర్

- ఉన్నత ఆశయం.. నిర్వహణ పూజ్యం
- జేఎన్‌టీయూకేలో నిరుపయోగంగా డే కేర్ సెంటర్
- కొద్ది రోజులుగా తెరచుకోని వైనం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో నాగవల్లి హాస్టల్‌లో గత నవంబర్ 1వ తేదీన పునః ప్రారంభించిన డే కేర్ సెంటర్ మూడునాళ్ల ముచ్చటగా మరింది. నాగవల్లి హాస్టల్ పక్కన అప్పటి వీసీ తులసీరామ్ దాస్ ఆధ్వర్యంలో 2012 ఫిబ్రవరిలో దీనికోసం భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. కొన్నాళ్లు పనిచేసిన అనంతరం కోవిడ్ కాలంలో మూతపడింది. గత ఏడాది నవంబర్ ఒకటిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ దానిని పునర్వినియోగంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో భవనాన్ని అన్ని వసతులతో ఆధునీకరించి రెక్టార్, రిజిస్ట్రార్, ఇతర అధికారుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్వహణకు ఇద్దరు సిబ్బందిని కేటాయించి సెలవు రోజుల్లో మినహా మిగతా పనిదినాల్లో పనిచేసేలా ఆదేశించారు. నాలుగు నెలల పాటు కొనసాగిన కేంద్రం గత మార్చి 15వ తేదీ నుంచి మళ్లీ మూతపడింది. వర్సిటీతో పాటు కళాశాలకు చెందిన టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ పిల్లలను డే కేర్ సెంటర్‌కు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని అప్పటి వీసీ మురళీకృష్ణ సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులు విధుల్లో ఉన్న సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉంటారని, సెంటర్‌కు వచ్చే చిన్నారులకు డ్యాన్సింగ్, మ్యూజిక్, పాటలు పాడడం వంటి పలు రంగాలలో ఆసక్తి కలిగించేలా పోస్టర్ ఏర్పాటు చేసి ఎంతో ఉన్నత ఆశయంతో దీనిని ప్రారంభించినప్పటికీ ఎంతో కాలం సాగలేదు. ఇటీవల వర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తమ రెండేళ్ల బాలుడిని డే కేర్ సెంటర్‌కు అలవాటు చేద్దామని వెళ్లితే గత 15 రోజులుగా మూసి ఉండటంతో నిరాశతో వెనుదిరిగాడు. వర్సిటీతో పాటు కళాశాలలో దాదాపు 800 మంది సిబ్బంది వరకూ టీచింగ్, నాన్ టీచింగ్, ఔట్ సోర్సింగ్ ఇలా పలు విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో చాలా మందికి డే కేర్ సెంటర్ ఉందని తెలియక పోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సెంటర్‌ను నిర్వీర్యం చేయకుండా తిరిగి దాని ప్రారంభించాలని, ఉద్యోగుల చిన్నపిల్లలను డే కేర్ సెంటర్‌కు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయం పై ప్రిన్సిపల్ మోహన్ రావుని వివరణ కోరగా పిల్లలు రాక పోవడం వల్ల తెరవడం లేదని, వర్సిటీ లేదా కళాశాల సంబంధించి సిబ్బంది పిల్లలు వస్తే సెంటర్ నిర్వహిస్తామన్నారు.

బోట్‌క్లబ్ ఉద్యానవనంలో ఉచిత రక్త పరీక్షలు



మహిళకు మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంగళవారం ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మెడ్విన్ సంజీవిన్ హాస్పటల్ సిబ్బంది రక్త నమూనాలు సేకరించి మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రతినిధి విజయ్ మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలి, మానసిక ఒత్తిడి కారణంగా 30శాతం మందికి మధుమేహం ఉన్నా సకాలంలో గుర్తించడం లేదన్నారు. యువతలో కూడా మధుమేహం కనిపిస్తుందని, ప్రతి ఒక్కరూ ఒత్తిడి తగ్గించుకోవడంతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, వ్యాయామం, నడక ద్వారా మధుమేహం బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్నప్రసాద్, డాక్టరు శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాదనాయుడు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణం అడ్డగింపుపై నిరసన



కూరాడలో నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు, సంఘం సభ్యులు

కరప: మండలం కూరాడలో చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పాస్టర్లు పి.సత్యప్రసాద్, సర్జనరాజు, ఆ సంఘ సభ్యులు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు నిరసన చేపట్టారు. చర్చి వద్ద టెంట్‌లో కూర్చుని నిరసన వ్యక్తంచేశారు. పాస్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కూరాడలో గంగుమళ్ల చంటమ్మ వద్ద 150 గజాల స్థలాన్ని 1986లో కొనుగోలు చేశామని, అప్పటి నుంచి గ్రామ పంచాయతీ అనుమతితో ప్రేయర్ హాల్ నిర్వహిస్తున్నామన్నారు. కట్టడం శిథిలావస్థకు చేరడంతో గతేడాది నూతన నిర్మాణం పనులు చేస్తుండగా కొందరు అడ్డుకోవడంతో పనులు ఆగిపోయాయని, తమకు అధికారులు న్యాయం చేయాలని పాస్టర్లు కోరారు.

ప్రకృతి వైపరీత్యాలపై 29న మాక్‌డ్రిల్



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటరావు

28న సన్నాహక సమావేశం

కాకినాడ సిటీ: వరదలు, తుపానుల సమయంలో చేపట్టాల్సిన తక్షణ సహాయక చర్యలు, సంసిద్ధతపై 29వ తేదీన తాళ్లరేవు మండలం కొత్తలంక గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో విపత్తుల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో డీఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా విపత్కర సమయాల్లో ఆయా శాఖలు చేపట్టే చర్యలను అడిగి తెలుసుకున్నారు. 29 నిర్వహించే మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు ఆయా సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మాక్‌డ్రిల్‌కు 28వ తేదీన నిర్వహించే టేబుల్ టాప్ ఎక్సెర్‌సైజ్‌కు ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని డీఆర్వో ఆదేశించారు. సమావేశంలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఈఎస్ రాజేష్, పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎం దేవులా నాయక్, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, ఇరిగేషన్ ఈఈ జి శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.భారతి, తాళ్లరేవు తహసీల్దార్ పి. త్రినాథరావు, డివిజనల్ పీఆర్‌వో పి.రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రచార జాతాలు ప్రారంభించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకరరావు, మధు
- ఎస్‌టీయూ భవన్‌లో కౌన్సిల్ జిల్లాస్థాయి విస్తృత సమావేశం

కాకినాడ సిటీ: సీపీఐ జిల్లా కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశం స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకరరావు, తాటిపాక మధు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల స్పందనకై పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ఈ నెల 23వ తేదీ భగత్‌సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు రాజకీయ ప్రచార జాతాలను ప్రారంభించాలని పిలుపునిచ్చిందన్నారు. ఈ పిలుపులో భాగంగా జిల్లాలో రాజకీయ ప్రచార జాతను ప్రజా సమస్యల స్పందనకై త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎన్డీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల భూమి, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమి, ఇల్లు నిర్మించేందుకు రూ.ఐదు లక్షల రుణాలు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ, రాష్ట్ర మహాసభలు త్వరలో జరగనున్నాయన్నారు. దాని ముందు శాఖ మహాసభలు, మండల మహాసభలు, జిల్లా మహాసభలు జరుపుకోవాలని ప్రభాకరరావు, మధు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేసవి కాలం రీత్యా ప్రభుత్వం ఉపాధి కూలీలకు బరకాలు లేదా టెంట్లు వేయించి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు బొబ్బిలి శ్రీనివాస్, పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ అరుగుల భవాని తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమైతేనే రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందన్నారు. స్థానిక జగన్నాథపురం మండల అధ్యక్షుడిగా కామాడి రాధాకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడా కృష్ణమోహన్, మాలకొండయ్య, దాట్ల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

సంప్రదాయ పోటీలకు ఆహ్వానం



ఉగాది పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

బోట్‌క్లబ్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా పిల్లలకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, పండుగ విశిష్టతపై కవితల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక రాంకోసా హాల్‌లో మంగళవారం పోటీల పోస్టర్‌ను పలువురు వైద్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ఉగాది పోటీలు నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ సాయంత్రం 4.30కు పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలు విలువలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతి పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అడ్డాల సత్యనారాయణ, యు రామకృష్ణ, ఉమ పాల్గొన్నారు.

లాభాల బాటలో జెడ్ భావారం పీఏసీఎస్



సంఘ కార్యకలాపాలను వివరిస్తున్న ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, సీఈఓ వెంకటేశ్వరరావు

కరప: మండలం జెడ్.భావారం సొసైటీ (పీఏసీఎస్) పరిధిలోని రైతులు, కౌలు రైతులకు సకాలంలో రుణాలు అందించి, లాభాలబాటలో నడిపిస్తున్నట్టు ఆ సంఘం ప్రత్యేకాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్‌వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ తెలిపారు. పీఏసీఎస్ వద్ద మంగళవారం మహాజన సభ నిర్వహించి ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ పరిధిలో 1032 మంది రైతులు సభ్యులుగా ఉండగా వారికి రూ.7.92 కోట్ల స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 16.22 లక్షల లాభాలు ఆర్జించినట్టు ప్రత్యేకాధికారి తెలిపారు. సీఈఓ రాయుడు వెంకటేశ్వరరావు గత ఏడాది సంఘం జమా ఖర్చులు, 2025-26 సంవత్సరం అంచనా బడ్జెట్, వాయిదా మీరిన బకాయిదారుల పేర్లు చదివి వినిపించి, సభ్యుల ఆమోదం కోసం తీర్మానాలు చేశారు.

తాబేళ్ల సంరక్షణ అందరి బాధ్యత



హోప్ ఐలాండ్ వద్ద సముద్రంలోకి తాబేళ్లను వదులుతున్న అధికారులు

బాలాజీచెరువు: తాబేళ్ల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హోప్ ఐలాండ్‌లో తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేసి బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. నేషనల్ గ్రీన్ ఎకో క్లబ్ విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ పర్యావరణ గీతాలు అందరినీ అకట్టుకున్నాయి. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, అటవీ శాఖ సిబ్బంది వీరభద్రరావు, సిద్దార్థ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న మేజిస్ట్రేట్ నిరూప భాన్జ్ డియో

కాకినాడ రూరల్: గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని, బాలికలకు పోక్సో చట్టం రక్షణగా నిలుస్తుందని కాకినాడ నాలుగో అదనపు జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ నిరూప భాన్జ్ డియో పేర్కొన్నారు. మండలంలోని పి.తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థిలను పోక్సో చట్టంపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తిమ్మాపురం ఎస్‌హెచ్‌ఓ సుస్మిత అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో బాలికలు, మహిళలకు రక్షణగా ఉన్న చట్టాల గురించి మేజిస్ట్రేట్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కరప: చేపల వేటపై అనుకున్నంతగా ఆదాయం రాక, చేసిన అప్పులు తీర్చలేనన్న బెంగతో ఒక మత్స్యకారుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరప మండలం ఉప్పలంకలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన కథనం మేరకు కొప్పనాతి గంగాధర్‌రావు(54) సొంతబోటు ద్వారా చేపల వేటతో జీవిస్తున్నాడు. అతనికి వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అతడి బోటు మరమ్మతులకు గురవడంతో కోటక్ మహీంద్రలో ఇంటిని తాకట్టుపెట్టి రూ.3.5 లక్షలు రుణం తీసుకున్నాడు. మూడు నెలలుగా సముద్రంలోకి వేటకు వెళ్లినా సరైన ఆదాయం రాక బ్యాంక్ వాయిదాలు కట్టలేకపోయాడు. మంగళవారం బ్యాంక్ వారు ఇంటికి వచ్చి 2 నెలలు ఆలస్యంగా వాయిదాలు చెల్లిస్తున్నావు, ఈనెల ఆలస్యం చేయొద్దని చెప్పి వెళ్లారు. వేటకు వెళ్లినా వస్తున్న కొద్దిపాటి ఆదాయంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన గంగాధరరావు ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుటుంబ సభ్యులు అతడిని గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గంగాధరరావు కుమార్తె లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన యాత్రలకు విద్యార్థులు



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యాశాఖాధికారులు

కాకినాడ సిటీ: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 126 మంది విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయుల బృందాన్ని విజ్ఞాన, విద్యా విషయక విహార యాత్రకు ఎంపిక చేసినట్లు డీఈఓ పి.రమేష్ మంగళవారం తెలిపారు. వీరిని బుధవారం యానాం, తిరుపతిలో గల ఐఐటి సందర్శనకు పంపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎ.శ్రీనివాస్ వినీల్, అకడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటరామారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు డీఈవో రమేష్ తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

మహిళా సాధికారతకు కృషి



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

బోట్‌క్లబ్: మహిళా సాధికారత కోసం మలబార్ గోల్డ్ ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో మంగళవారం బాలికలకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. కాకినాడలో వివిధ ప్రభుత్వ కళాశాల్లో చదువుతున్న 107 మంది విద్యార్థినులకు రూ.10 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కాకినాడ షోరూం హెడ్ ఉండమట్ల శ్రీకాంత్ మాట్లాడుతూ తమ సంస్థ 1999లో మలబార్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సంస్థ లాభాల్లో ఐదు శాతాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి నూకరాజు, మలబార్ గోల్డ్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

వికాస ఇంటర్వ్యూల్లో 131 మంది ఎంపిక

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన విర్‌ట్యూ కన్సల్టింగ్ సర్వీసు (వర్కింగ్ ఫర్ గూగుల్) కంపెనీలో కంటెంట్ ఎనలిస్ట్ ఉద్యోగానికి సుమారు 1440 మంది అభ్యర్థులు పాల్గొన్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు మంగళవారం తెలిపారు. ఇంటర్వ్యూల్లో 131 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జేసీ రాహుల్‌మీనాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

31వ తేదీ వరకు ధాన్యం సేకరణ

కాకినాడ సిటీ: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ఈ నెల 31వ తేదీ వరకు సాగుతుందని జేసీ రాహుల్‌మీనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని దగ్గరలో ఉన్న రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలు ఒక్కొంటికి కామన్ రకం రూ. 2,300లకు, గ్రేడ్ ఏ రకం 2,320కు విక్రయించ వచ్చని జేసీ తెలిపారు.

నవోదయకు మేడపాడు విద్యార్థులు

సామర్లకోట: మండలం జి. మేడపాడు మండల పరిషత్తు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జి. మేడపాడు మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న జమ్మి బాలశ్రీ సాయి రోక్షిత్, ఆకుల సుకుమార్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఆరో తరగతిలో నవోదయలో చేరే అవకాశం ఉంటుందని చెప్పారు. వీరికి ఆ పాఠశాల టీచరు చవ్వాకుల సత్యనారాయణ శిక్షణ ఇచ్చారన్నారు.